క్లుప్తంగా

అన్నదానానికి రూ.10 వేల విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న పర్యవేక్షకుడు సత్యమూర్తి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు అమలాపురానికి చెందిన సీఎస్‌కే సుబ్రహ్మణ్యం వారి కుటుంబ సభ్యులు ఆదివారం రూ.10,001 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ పర్యవేక్షకుడు సత్యమూర్తికి అందించారు. దాతకు అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ దాతను అభినందించారు.

జ్యోత్స్నకు అభినందనలు



అంబాజీపేటలో జ్యోత్స్నను సన్మానిస్తున్న దళిత నాయకులు

అంబాజీపేట: ఇంటర్మీడియెట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులో 980 మార్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డు అందుకున్న వల్లూరి జ్యోత్స్నను అంబాజీపేట మండల దళిత నాయకులు అభినందించారు. జ్యోత్స్న స్వగృహంలో తనను దుశ్శాలువా, పూలమాలలతో ఆదివారం ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరింత బాగా చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు నాగాబత్తుల వెంకటపతి, నాగాబత్తుల నరసింహమూర్తి, నెల్లి వెంకటరమణ, గోసంగి సత్యనారాయణ, చింతా రాజేంద్ర, నక్కా భాస్కర్, కత్తుల బాబులు ఉన్నారు.


ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారు



హెచ్‌ఎం అరుణజ్యోతిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మామిడికుదురు: అప్పనపల్లి బాడవ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా కుడుపూడి అరుణజ్యోతి ఎనిమిదేళ్లు సుదీర్ఘకాలం పని చేసి విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దారని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గెడ్డం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అరుణజ్యోతి బదిలీ అయిన సందర్భంగా ఆమెను ఆదివారం స్కూల్లో జరిగిన సమావేశంలో ఘనంగా సత్కరించారు. ఆమె విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించారని చెప్పారు. ఆమె అందించిన సేవలను ప్రముఖంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు యన్నాబత్తుల రాజేష్, కారుపల్లి సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ చిట్టాబత్తుల నాగరాజు, ఉపాధ్యాయులు విప్పర్తి మోహనరావు, కారుపల్లి కల్యాణ్‌బాబు, అంగన్వాడీ టీచర్ గెడ్డం పల్లాలమ్మ, పెద్దలు బత్తుల జనార్దన్, నీతిపూడి మహేష్, ఇసుకపట్ల రాము తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణభగవానునికి విశేష పూజలు



శ్రీకృష్ణునికి విశేషపూజలు చేస్తున్న ప్రభూజీ

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో శ్రీకృష్ణభగవానునికి ఆదివారం వైభవంగా పూజలు జరిపారు. మందిర్ నిర్వాహకులు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. హరినామ సంకీర్తనలు, తులసిపూజ, లక్ష్మీనరసింహస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీమద్భాగవత ప్రవచనం నిర్వహించారు. శ్రీకృష్ణుని మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని కీర్తించారు. స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

తేనెటీగల పెంపకంపై ముగిసిన శిక్షణ శిబిరం

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులో ఆదివారం మహిళలకు నిర్వహించిన ఏడు రోజుల తేనెటీగల పెంపకంపై శిక్షణ శిబిరం ముగిసింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (హైదరాబాదు, ఎన్ఐ-ఎంఎస్ఎంఈ) సహకారంతో సంకల్ప సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 25 మంది మహిళలు పాల్గొన్నారు. ఎన్ఐ-ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రత్నకిషోర్ శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వెంచర్ మేనేజర్ గంటా సునీల్, ట్రైనర్ నటరాజ్ పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

- ప్రతి శని, బుధవారాల్లో పీహెచ్‌సీల్లో లభ్యం
- గర్భిణులు, చిన్నారులకు ఉచితం



కొత్తపేటలో చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కొత్తపేట: భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే జన్మించినప్పటి నుంచీ వివిధ వయసుల్లో వైద్యులు సూచించిన విధంగా టీకాలు వేయించుకోవాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకూ వైద్య, ఆరోగ్య శాఖ సూచించిన సమయాల్లో ఆయా టీకాలు వేయిస్తే వ్యాధులు దరిచేరకుండా జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని వైద్యులు చెబుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఫ్యామిలీ ఫిజీషియన్ స్కీం అమలు చేశారు. ఆరోగ్య సిబ్బంది నిరంతరం ఇంటింటినీ సందర్శించేవారు. అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందించారు. ప్రస్తుతం ఆ స్కీము లేక దూరంగా ఉన్న ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వ్యాధులు, టీకాలపై అవగాహన లేక వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా అన్ని సచివాలయాల్లో ప్రతి నెలా 1, 2, 3 బుధవారాలు, 1, 3 శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా టీకాలు వేస్తున్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటి వల్ల గర్భిణులు సుఖంగా ఆరోగ్యకరమైన పండంటి బిడ్డను ప్రసవిస్తారు. ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై ఆరోగ్య సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.శ్రీదివ్య, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, అవిడి

వ్యాక్సిన్లు ఇలా..

- గర్భిణిగా నిర్ధారణ అయి 3 నెలలు నిండిన తరువాత టీటీ ఇంజక్షన్, నెల రోజుల వ్యవధిలో మరో టీటీ ఇంజక్షన్ చేయించుకోవాలి. వీటితో పాటు ఐరన్, ఫోలిక్, కాల్షియం మాత్రలు ఇస్తారు. వాటిని విధిగా వేసుకోవాలి. ప్రసవం అనంతరం ఐరన్ మాత్రలు వాడాలి.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బీ డోస్ వేయించాలి. వీటి వల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
- 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- 6, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితో పాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వేయించాలి. వీటివల్ల కోరింత దగ్గు, కంఠ సర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్ల వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు.
- 9 నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఏ చుక్కలు వేయించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోస్ డీపీటీ, మీజిల్స్, విటమిన్-ఏ ఓపీ వేయించాలి.
- 9 నెలల నుంచి 5 ఏళ్ల వరకూ ప్రతి ఆరునెలలకు ఒకసారి విటమిన్-ఏ చుక్కలు మొత్తం 9 డోసులు వేయించాలి.
- 5 సంవత్సరాలు పూర్తయిన తరువాత డీపీటీ డోస్ వేయించాలి.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



సంధిపూడిలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన కోదండరామస్వామి ఆలయ 30వ వార్షికోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రముఖ వేద పండితుడు గుండు బ్రహ్మన్న మంత్రోచ్చారణల మధ్య హైదరాబాద్‌లో నివాసముంటున్న వ్యాపారవేత్త నాగులపల్లి మురళీకృష్ణ, నాగమణి దంపతులు ఈ వార్షికోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తొలుత సన్నాయి వాయిద్య మేళాలు, బాణసంచా కాల్పుల మధ్య బంధువులతో ఊరేగింపుగా వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీరామ ఏకాహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భజన భక్త బృందం ఆలపించిన శ్రీరామ కీర్తనలు గ్రామస్తులను మంత్రముగ్ధుల్ని చేసింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ వార్షికోత్సవ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో పిండివంటలతో భారీ అన్న సమారాధన జరిగింది.

ఆకుమడులకు ఆయిల్ ఇంజిన్లే ఆధారం



కె.పెదపూడిలో ఆయిల్ ఇంజిన్ ద్వారా ఆకుమడులకు పెడుతున్న నీరు

అంబాజీపేట: కార్తెలు మారుతున్నాయి.. రుతుపవనాలు తొంగిచూస్తున్నాయి. ఇప్పటికి ఇంకా సరైన వర్షం పడలేదు. సాధారణంగా మృగశిర కార్తె వచ్చిందంటే చాలు ప్రకృతి తొలకరిస్తుంది. వర్షాలు రైతులను పలకరిస్తాయి. రుతుపవనాల కలయికతో వర్షాలు కురుస్తాయి. రైతులు తొలకరి పంటసాగుకు సమాయత్తమై వరి ఆకుమడులు పోసేందుకు సిద్ధమవుతారు. కానీ ఇప్పటివరకు సరైన వర్షం కురవలేదు. ప్రధాన ప్రాంతంలో ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు కాలువల ద్వారా ఇంకా ఇప్పటికే అందడం లేదు. దీంతో రైతులు ఆయిల్ ఇంజిన్లపై ఆధారపడి ఆకుమడులు పోసేందుకు సిద్ధమవుతున్నారు. విద్యుత్ మోటార్లపై ఆధారపడి ఆకుమడులు పోద్దామంటే త్రీఫేజ్ కరెంటు తమకు అనుకూలమైన సమయంలో ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. పంటకాలువలకు సాగునీరు సరఫరా కాకపోవడంతో ఆయిల్ ఇంజిన్లపై ఆధారపడి ఆకుమడులు పోస్తున్నామని కె.పెదపూడికి చెందిన తిరుమనాథం సూరన్నకాపు, ఇతర రైతులు చెబుతున్నారు. లీటరు డీజిల్ ఆయిల్ రూ.99 వరకు ఉందని సన్న, చిన్నకారు, కౌలు రైతులు పెట్టుబడులు పెట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం మృగశిర కార్తెలో ఆకుమడులు వేయాలని, 4 నుంచి 5 ఆకులు ఉన్న నారును ఆరుద్ర కార్తె నాటికి ఊడ్చినట్లయితే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో నిర్వహిస్తున్న స్వామి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం ఆర్జిత సేవగా స్వామి వారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనులపండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యాన అర్చకుడు పి.రామశేషాచార్యులు, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం, అలాగే లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు. కాగా ఆలయంలో స్వామివారి ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనం టికెట్లు, ఇతర సేవాటికెట్ల ద్వారా రూ.1,28,592 ఆదాయం, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాల ద్వారా రూ.1,23,025 ఆదాయం వచ్చినట్లు ఏసీ ప్రసాద్ పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సందడి చేసిన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: లూటుకుర్రు జెడ్పీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1998–99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సందడి చేశారు. తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని మురిసిపోయారు. చదువుకునే రోజుల్లో చేసిన చిలిపి సంఘటనలను మననం చేసుకున్నారు. గ్రామ సర్పంచ్ అడబాల తాతకాపు, హెచ్‌ఎం జి.నాగప్రసాద్‌లను సైతం సత్కరించారు. కార్యక్రమంలో గోకవరపు రాము, గోకవరపు ప్రసాద్, అప్పన హరిచక్రపాణి, అడబాల వీరభద్రం, కొరసాల సతీష్‌కుమార్, కానేటి వెంకటశ్రీనివాస్, కంచి వెంకట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముంపునకు గురైన అపరాల పంట



మామిడికుదురులో డ్రైన్‌కు అడ్డుగా వేసిన గట్టు

మామిడికుదురు: గ్రామంలో వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌కు అడ్డుగా వేసిన గట్టు వల్ల అపరాల పంట ముంపుబారిన పడిందని రైతులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. అనధికారికంగా నిర్మిస్తున్న వంతెన పనుల కోసం డ్రైన్‌కు అడ్డుకట్ట వేశారన్నారు. దీని వల్ల డ్రైన్ నీరు పారుదల కాక పంట పొలాలను ముంచెత్తిందని వాపోయారు. తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

జెడ్పీ చైర్మన్ పరామర్శ



బెల్లంపూడిలో లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: బెల్లంపూడి గ్రామంలో మాతృవియోగంతో బాధపడుతున్న ఓ చానల్ విలేకరి గూటం శ్రీనివాస రావును జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆదివారం పరామర్శించారు. శ్రీను తల్లి లక్ష్మి చిత్రపటానికి విప్పర్తి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు పాముల రాజేశ్వరీదేవి శ్రీను సోదరులను పరామర్శించారు. పార్టీ నాయకులు సాధనాల రమేష్, కొక్కిరి రవికుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10,116 విరాళం



దాత కృష్ణచైతన్య దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఒంగోలుకు చెందిన గొల్ల కృష్ణచైతన్య, దామిని దంపతులు ఆదివారం రూ.10,116లు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

కొద్దిపాటి వర్షానికే రోడ్లు అధ్వానం



అప్పనపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

మామిడికుదురు: అప్పనపల్లిలో ఒక మాదిరి వర్షానికే ప్రధాన రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. రోడ్లపై భారీగా వర్షపునీరు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై భారీగా గోతులు ఏర్పడి వాటిలో వర్షం నీరు నిలిచిపోతుంది. వర్షం నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో దోమలు పెరిగిపోయి అవస్థలు పడుతున్నామంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామదేవత కనక మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద నుంచి సాకావారిపేట వెళ్లే రోడ్డుతో పాటు అదే మార్గంలో పెద్ద వీధికి వెళ్లే రోడ్డు కూడా పాడైపోయింది. అదే గ్రామంలో మొల్లేటివారిపాలెంలో సొసైటీ కార్యాలయం వద్ద నుంచి స్నానాల రేవుకు వెళ్లే మార్గంలో రోడ్డుపై కూడా భారీగా వర్షం నీరు నిలిచిపోతుందని స్థానికులు వాపోతున్నారు. రహదారులను అభివృద్ధి చేస్తామని ప్రజా ప్రతినిధులు హామీలు ఇవ్వడం తప్ప రోడ్ల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైపోయిన రోడ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈదురుగాలులకు కూలిన ధ్వజస్తంభం



మామిడికుదురులో ఈదురుగాలులకు పడిపోయిన ధ్వజస్తంభం

మామిడికుదురు: భారీ ఈదురుగాలుల ప్రభావానికి మామిడికుదురులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ధ్వజస్తంభం కూలిపోయింది. ఆలయానికి భక్తులు వస్తుంటారు. కానీ శనివారం రాత్రి తొమ్మిది గంటలు దాటిన తర్వాత ఈ సంఘటన జరిగింది. ఆ సమయంలో ఆలయంలో అర్చకులతో సహా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆలయం వెలుపల భారీ అభయాంజనేయస్వామి విగ్రహం ఉంది. ఆ విగ్రహం పక్కనే ధ్వజస్తంభం పడింది. దీంతో అక్కడ ఏ విధమైన నష్టం జరగకపోవడం విశేషం. సుమారు 11 ఏళ్ల క్రితం ఈ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారని ఆలయ అర్చకుడు చంద్రమౌళి భాస్కరం ఆదివారం తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పడిపోయిన ధ్వజస్తంభాన్ని పరిశీలించారు.

పాఠశాలల్లో నిరుపయోగంగా కంప్యూటర్లు



అంబాజీపేటలో శిథిలమై మూలకు చేరిన కంప్యూటర్లు

అంబాజీపేట: శాస్త్ర సాంకేతిక ఉరకలు వేస్తున్న ప్రస్తుత తరుణంలో గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందకుండా పోతుంది. గత 15 ఏళ్లుగా కంప్యూటర్ విద్య విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. కంప్యూటర్ విద్య ఈ ఏడాదైనా ప్రారంభిస్తారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యంతో కొత్తపేట డివిజన్ వ్యాప్తంగా సుమారు 20 పాఠశాలల్లో సర్వశిక్షాభియాన్ నిధులతో ప్రారంభమైన కంప్యూటర్ బోధన అనంతరం 90 పాఠశాలల్లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందేది. అనంతరం నిట్ సంస్థతో 2007లో ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం 2008 విద్యా సంవత్సరం నుంచి పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని సుమారు 90 పాఠశాలల్లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించే ఏర్పాటు చేశారు దీని నిమిత్తం కాంట్రాక్ట్ పద్ధతిలో టీచర్లను నియమించి ఒక్కో టీచర్‌కు రూ.2,300 చొప్పున జీతం ఇచ్చేవారు. అయితే కంప్యూటర్ ఉపాధ్యాయుల ఒప్పందం 2013తో ముగియడంతో విద్యార్థులకు నాటి నుంచి విద్య అందడం లేదు. కంప్యూటర్ల అనుమతి కాలం గడచిపోవడంతో ఆ సంస్థ వారు కంప్యూటర్లను మెయింటెనెన్స్ చేయకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. దీంతో కంప్యూటర్ విద్య కాస్తా అటకెక్కింది. రూ.లక్షల వ్యయంతో పాఠశాలలకు అందజేసిన కంప్యూటర్లు ఎందుకూ పనికి రాకుండా పోవడంతో ఒక చోట భద్రపరిచారు. ఈ ఏడాదయినా కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఏమాత్రం పట్టించుకోని కూటమి ప్రభుత్వం కంప్యూటర్ విద్యను విద్యార్థులకు అందిస్తుందా అనే సందేహం విద్యార్థుల తల్లితండ్రుల్లో నెలకొంది.

రహదారికి మోక్షమెప్పుడో?



ఇసుకపూడిలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

అంబాజీపేట: రహదారులను అభివృద్ధి చేసేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వానికి, అధికార ప్రజాప్రతినిధులకు గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇసుకపూడి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి శిథిలమై అధ్వానంగా ఉంది దానిని అభివృద్ధి చేయాలని స్థానికులు పలుమార్లు కోరుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారని వాపోయారు. స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకులు కూడా ఈ రహదారికి మోక్షం కలిగించకుండా నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కేవలం ఇక్కడ సర్పంచ్, ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీకి చెందిన వారు ఉండటం వల్లే అధికార పార్టీ నాయకులే అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ రహదారిలో గుంతలు ఏర్పడి నడిచేందుకు వీలు లేకుండా ప్రమాద భరితంగా మారింది. కొద్దిపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారడంతో అటుగా వెళ్లే పాఠశాల విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు నానాఅవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో ద్విచక్ర, సైకిలిస్టులు ప్రయాణించి ప్రమాదాల బారిన పడ్డారన్నారు. పక్క గ్రామాల్లో పార్టీలకు అతీతంగా ప్రజలకు అవసరమయ్యే రహదారులను నిర్మిస్తే ఇక్కడ మాత్రం విరుద్ధంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అధ్వానంగా ఉన్న రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుపై వివాదం

సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న పోలీసులు



హడ్కో కాలనీలో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం

అంబాజీపేట: భారత ఉపప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రాం విగ్రహ ఏర్పాటుపై వివాదం తలెత్తింది. సమస్య పరిష్కారానికి పోలీసులు కృషి చేస్తున్నారు. ఇందుకు సంబంధించి మాచవరం పంచాయతీలోని పశువుల సంత సమీపాన ఉన్న హడ్కో కాలనీలో శనివారం రాత్రి స్థానిక దండోరా యువకులు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. హడ్కో కాలనీలో దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితమే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఇందిరాగాంధీ విగ్రహాలను మాల సామాజిక వర్గీయులు ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాల చెంతనే దండోరా యువకులు కూడా జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని నెలకొల్పారు. కాగా గత కొన్నేళ్లుగా జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు విషయంలో రెండు సామాజిక వర్గీయుల మధ్య వివాదం తలెత్తుతూనే ఉంది. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని వేరేచోట పెట్టుకోవాలని మాల సామాజిక వర్గీయులు, అంబేడ్కర్, ఇందిరా గాంధీ విగ్రహాల చెంతనే జగ్జీవన్ రామ్ విగ్రహం ఉండాలంటూ దండోరా సామాజిక వర్గీయులు పట్టుబడుతూ, శనివారం రాత్రి జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని హడావుడిగా నెలకొల్పారు. ఈ వివాదం కాస్త పోలీస్‌స్టేషన్ వరకూ చేరింది. విగ్రహం ఏర్పాటు చేసిన స్థలాన్ని పోలీసులు పరిశీలించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. హడ్కో కాలనీలో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహ వివాదంపై ఇరు సామాజిక వర్గాలతో చర్చిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొంటామని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి ఎస్సైలు బి.శివకృష్ణ, ఎ.చైతన్యకుమార్, హరికోటిశాస్త్రి, పోలీస్ సిబ్బందితో బందోబస్తు చేస్తున్నారు.

ఫిషింగ్ హార్బర్ పరిశీలన

సఖినేటిపల్లి: పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌ను ఆదివారం అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ (విజయవాడ)ఎ.చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. హార్బర్‌లో మత్స్యకారులకు సౌకర్యాల గురించి పరిశీలన చేశారు. ప్రభుత్వపరంగా తగిన సౌకర్యాలు కల్పనకు కృషి చేయగలమని అన్నారు. వెంట రాజోలు ఏడీ సిద్దార్థ వర్ధన్, ఎఫ్‌డీఓ సీహెచ్ గోపాలకృష్ణ, మత్స్యశాఖ సహాయకుడు బి.అర్జున్, ఎం.రవికుమార్ పాల్గొన్నారు. తొలుత అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఫిషరీస్ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.